


# వైజ్ఞానిక ఆధ్యాత్మికత

# "వైజ్ఞానిక ఆధ్యాత్మిక విజ్ఞానము"

డా॥ మారెళ్ల శ్రీశ్రీరామకృష్ణ గారు ఎమ్మెస్సీ., పిహెచ్.డి.

# ప్రార్థన - ప్రతిస్పందన

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం ।
న్యాయేన మార్గేణ మహీం మహీశా: ॥
గో బ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం ।
లోకాః సమస్తాః సుఖినో భవన్తు ॥

పృథ్వి మీద పరిపాలన మంచిగా వుండాలి.
రాజులు భూమిని న్యాయబద్ధంగా పాలించుగాక!!



గో, బ్రాహ్మణులకి నిత్యమూ శుభము కలగాలి. గోఅనగా ఆవులనే కాదు ఇంద్రియాలనే అర్థముకూడా ఉంది. వాటిమీద అనగా కన్ను, చెవి, నోరు, ముక్కు, చర్మముల మీద నియంత్రణ కలిగినవారు బ్రాహ్మణులు. సమస్త లోకాలు సుఖంగా ఉండుగాక!

కాలే వర్షతు పర్జన్య:
పృథ్వీ సస్యశాలినీ ।
దేశోఽయం క్షోభరహితో
బ్రాహ్మణాస్సన్తు నిర్భయా: ॥


సకాలంలో పర్జన్యంతో కూడిన వర్షాలు కురవాలి.
భూమండలమంతా కూడా సస్యశ్యామలంగా ఉండాలి.



దేశంలో యేవిధమైన క్షోభా ఉండకూడదు.
బ్రాహ్మణులు అంటే వేదాల గురించి చెప్పేవాళ్ళు నిర్భయంగా వుండాలి.

సర్వేభవన్తు సుఖిన:
సర్వేసన్తు నిరామయా: ।
సర్వేభద్రాణి పశ్యన్తు
మాకశ్చిత్ దు:ఖమాప్నుయాత్ ॥

సృష్టిలోని సమస్త ప్రాణులు సుఖంగా వుండాలి.
అందరుకూడా భగవంతుని మీద భారంవేసి జీవితాన్ని నిరామయంగా గడపాలి.




అన్నివైపులా భద్రత వుండాలి. ఎవరికి ఏవిధమైన కష్టమూ రాకూడదు.

అపుత్రా: పుత్రిణ: స్సన్తు
పుత్రిణ: సన్తు పౌత్రిణ: ।
నిర్ధనాః సధనాః సన్తు
జీవన్తు శరదాం శతమ్
ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

పిల్లలు లేని వాళ్ళకి పిల్లలు కలుగుగాక!
పిల్లలున్నవాళ్ళకి మనుమలు కలుగుగాక!





ధనము లేని వాళ్ళకి ధనము సమకూరాలి.
అందరు సుఖంగా, ఆరోగ్యంగా వంద సంవత్సరాలు జీవించాలి.

అసతోమా సద్గమయ ॥ తమసోమా జ్యోతిర్గమయ ॥ మృత్యోర్మా అమృతజ్గమయ ॥
స్వార్థం మా పరమార్థజ్గమయ ॥ అవ్యవస్థా మా సువ్యవస్థాజ్గమయ ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః** ॥

# ప్రార్థన - ప్రతిస్పందన విజ్ఞానము

కష్టాలలో వున్నవారికి భౌతికముగా మనము వెళ్ళి సహాయము చేయలేకపోవచ్చు. చెయ్యాలనే ఆర్తి, తపన, నిర్మలమైన మనస్సు వున్నవారు అంతఃకరణ సాధనగా ఒక చక్కటి ప్రయోగముగ చెయ్యవచ్చు. దాన్నే ప్రార్థన - ప్రతిస్పందన విజ్ఞానము అని అంటారు. ఇది ఒక అద్భుతమైన మంత్రవిజ్ఞానము.

ఉదయము 6.00గంటలకు, మధ్యాహ్నము 12 గంటలకు, సాయంత్రము 6.00గంటలకు ప్రశాంత చిత్తముతో చేసే ఒక విశేషమైన ప్రయోగము ప్రార్థన - ప్రతిస్పందన విజ్ఞానము.

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం ।

న్యాయేన మార్గేణ మహీం మహీశాః ॥

గో బ్రాహ్మణేభ్యోః శుభమస్తు నిత్యం ।

లోకాః సమస్తాః సుఖినో భవన్తు ॥

కాలే వర్షతు పర్జన్యః పృథ్వీ సస్యశాలినీ ।

దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సన్తు నిర్భయాః ॥

సర్వేభవన్తు సుఖినః సర్వేసన్తు నిరామయాః ।

సర్వేభద్రాణి పశ్యన్తు మాకశ్చిత్ దుఃఖమాప్నుయాత్ ॥

అపుత్రాః పుత్రిణః స్సన్తు పుత్రిణః సన్తుపౌత్రిణః ।

నిర్ధనాః సధనాః సన్తు జీవన్తు శరదాం శతమ్ ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

అందఱు సుఖంగా వుండాలి. పిల్లలు లేనివాళ్ళకు పిల్లలు కల్గాలి, డబ్బులేని వాళ్ళకు డబ్బు రావాలి అని నువ్వు కోరుకుంటే అది నీకుకూడ వస్తుంది. కర్మ సిద్ధాంతం అదే చెపుతుంది. కాని అది ఒక రోజు, రెండు రోజుల్లో రాదు. చదువు రావాలంటే యెన్ని సంవత్సరాలు పడుతుంది. 5 ఏళ్ళ వయస్సునుండి 21 సంవత్సరములవఱకు కష్టపడితే పట్టా చేతికి వస్తుంది. అదికూడా రోజుకి ఏడు నుండి ఎనిమిది గంటలు కష్టపడి చదివితే.

ఆధ్యాత్మికజగత్తులో భగవద్గీత, రామాయణము, భాగవతము యివి చాల అద్భుతమైన పుస్తకాలు. వాటిని స్వాధ్యాయానికి చదువుకుంటున్నాము. మనంతట మనము యిలాంటి ఆధ్యాత్మిక వైజ్ఞానిక పుస్తకాలు చదివితే ప్రపంచాన్నే శాసించగల్గుతాము.

**భారతజాతి వుంటే జగద్గురుపీఠంలో వుంటుంది లేకపోతే ప్రపంచమే నాశనమౌతుంది.**

ఆ పని చేయటానికి యెవరొస్తారు? ఐన్‌స్టీన్‌లాంటి ఒక వ్యక్తి చాలుకదా అణుబాంబు యివ్వటానికి. అలాగే యీ పుస్తకాలు చదువుతున్న 630 కోట్లమందిలో యే ఒక్కడైనా ఋషి సమూహ స్థాయిలోకి వెళ్ళిపోయినా చాలు, ప్రపంచము రక్షింపబడుతుంది. కానీ వాడీ ప్రపంచంలో యెక్కడున్నాడో తెలియదు.

జ్వాలాకూల్ మహర్షిలాంటి వారి యొక్క వుద్దేశ్యంలో ప్రస్తుతము వున్న సమాజంలో ప్రతి ఐదుగురిలో ముగ్గురికి ఆ స్థాయికి యెదగటానికి కావల్సిన అర్హతున్నది.

కనుక నేను ఆ అవకాశాన్ని అర్థము చేసుకుంటాను. అది ప్రకృతి నాకు యిచ్చినటువంటి వరము, అవకాశము. దాన్ని నేను పరిపూర్ణముగ వుపయోగించుకుంటాను అని ప్రతి వ్యక్తి అనుకోవాలి.

తోటి మానవుణ్ణి ప్రేమిస్తూ స్వస్తి ప్రజాభ్యః ....... అనేది మనస్ఫూర్తిగా చెపితే మన జీవితాలే మారి పోతాయి. మనకున్న అనేక రోగాలు బి.పి., గుండె నొప్పి .....పోతాయి. మన కుటుంబాలలో పిల్లలు లేనివాళ్ళకి పిల్లలు పుడతారు. ఉద్యోగము లేనివాళ్ళకి వుద్యోగము వస్తుంది..... మన అన్ని కోరికలు తీరుతాయి. ఇన్ని లాభాలున్నాయని తెల్సినా మిగతా పనులన్నీ చేస్తున్నాముకానీ యిది చెయ్యలేకపోతున్నాము. పైగా యిది చేస్తే నా కోరికలు తీరుతాయా? అనే అనుమానముకూడా వున్నది.

సకాలంలో వర్షం కురవాలి అని అనుకుంటాము. కానీ మళ్ళీ వర్షము కురిస్తే వెధవ వర్షము అని తిట్టుకుంటాము. వర్షము కురవాలని నోటితో అంటాము. కానీ మన మనస్సుకి అది నచ్చదు. వర్షము మన ఇంటి ప్రక్కన కుఱవాలి కానీ మనకు దానివలన యిబ్బంది వుండకూడదు. అంటే మనము నోటితో చెప్పేది ఆచరణలోకి రావటంలేదు.

భూమి తన సమస్త సారము కోల్పోతోంది. మనము పండించే పంటలు వాటికి కావలసిన సారము యెక్కడినుండి తీసుకుంటున్నాయి? భూమినుండి తీసుకుంటున్నాయి. అంటే నువ్వు ఒక పంట పండించావు. భూమిలోని సారము దానిలోకి వెళ్ళింది. మళ్ళీ పంట పండించావు. మళ్లీ సారము తగ్గింది. ఇలా మనము యెన్ని వేల సంవత్సరాలబట్టీ పంట పండిస్తున్నాము? మఱి మళ్ళీ భూమిలోకి సారము యెలా వస్తోంది!! ఇప్పుడు భూమిలో సారము యెందుకు లేదని యెవరూ ప్రశ్నించటము లేదు.

ఋషులు చెప్పిందేమిటంటే అంతరిక్షంలో సోమరసము వుంటుంది. వర్షము కుఱవటమువలన అంతరిక్షంలో వున్న ఆ సోమరసము భూమిలోకి దిగితే భూమి తిరిగి సారవంతమౌతుంది. అప్పుడు నువ్వు

విత్తనాలు వేసి పంట పండిస్తే వనరులు సమకూరుతున్నాయి అని. ఆ సారమును 'పర్జన్యము' అని అంటారు ఋషులు. అందుకని అసలైన సారము యెక్కడుంది? ఆకాశంలో వున్నది.

దాన్ని రష్యన్ శాస్త్రవేత్తలు నిరూపించారు. వాళ్ళు మన ఋషులు చెప్పిందే ప్రయోగాలు చేసి చెప్పారు. తర్కము ప్రకారము చూస్తే యిన్నివేల సంవత్సరాల బట్టీ పంటలు పండిస్తుంటే భూమిలోని సార మెప్పుడో అయిపోవలసినదే. కానీ యెందుకు అయిపోలేదంటే భూమిలోకి సారము యెక్కడనుండొ వస్తోంది. ఆ విషయమును తెలుసుకున్నారు.

'స్వస్తి ప్రజాభ్యః........' లో ఋషులు కోరుకోమన్నది అదే. పృథ్వీ సస్యశాలినీ..... అని కోరుకోమన్నారు. కాబట్టి మనము యిది అంటున్నప్పుడు ధ్యానస్థితిలోకి వెళ్ళి అనాలితప్ప వుత్తినే అనకూడదు. భావము కలపాలి. ఇది ఒక అద్భుతమైన ప్రయోగము. ఇది మనలను గురువుల ప్రణాళికలో భాగస్వాము లయ్యేటట్లు చేస్తుంది.

మానవజాతి యొక్క అంత:స్పందన మఱియు ఋషిపరంపర యొక్క అంత:స్పందన, మే, జూన్ పూర్ణిమలలో ఔత్సాహికుల యొక్క చల్లనికాంతి, దీక్షితుల యొక్క స్పష్టమైన కాంతితో పరస్పరము మిళితమై వారెక్కడున్నా, యే పరిస్థితులలో వున్నా నిస్వార్థ భావముతో చేసేవారికి స్ఫూర్తిని, ప్రేరణని యిస్తుంది.

స్వస్తిప్రజాభ్య: పరిపాలయన్తాం... అనే ప్రార్థన, ప్రతిస్పందనని సామూహిక ప్రజాశక్తిగా మార్చటానికి మనము తొందరగా పనిచేయాలి.

ఈ శరీరాన్ని దేవాలయంలాగ మార్చుకునే సంకల్పశక్తిని ప్రోదిచేసుకునే ధ్యానము చేసుకోవాలి. అందువల్ల ప్రార్థన మాత్రమే అనేది స్వార్థపరమైన ప్రక్రియ. దీనిక్కూడా ప్రతిస్పందన ఆ భగవంతుడి దగ్గఱనుండి ఆశిస్తూంటాము. ముందు మన స్వార్థపరమైన కోరికలు కోరుతూవుంటే అవి ఫలిస్తూంటే దాని అర్థమేమిటంటే- మనలో ప్రతిస్పందన పనిచేస్తోందని.

అందుచేతనే శిర్డిసాయి ముందు నీ కోరికలు తీర్చుకో అన్నాడు. నీలో ప్రతిస్పందన శక్తి వస్తే అంటే గురుఅనుగ్రహము వుంటే కోరికలు తీరుతాయి. ఈ స్థాయికి వచ్చాకమాత్రమే సమర్పణ చేసుకోగలవు. తిరుపతిలో, శిర్డిలో, హరిద్వార్‌లో కోరికలు తీర్చుకునేందుకు వెళ్ళేవారంతా కచ్చితంగా సమన్వయ అవతార ప్రేరణవల్లే వెడతారు. ఇది పూర్వార్థము. కానీ ఉత్తరార్థ మున్నది అని తెలియకపోవటము వల్ల ఆ సమన్వయ అవతారము నీ అహంకారమును చంపేస్తోంది. వ్యక్తిత్వాన్ని కోల్పోయేలా చేస్తోంది.

ఒకటి ప్రార్థన, రెండు ప్రతిస్పందన.

కోరిక యొక్క శక్తి యేమి చేస్తుందంటే భౌతిక శరీరాన్ని కోరికకి అనుగుణ్యంగా మారుస్తుంది. దీన్ని invocation అంటాము. సంకల్పశక్తి యేమి చేస్తుంది? శరీరాన్ని భగవంతుని కోరికకు అనుగుణ్యంగా లోపలినుంచి మారుస్తుంది. దీన్ని evocation అంటాము.

అందుచేత ఒకటి నీలోంచి వచ్చే స్పందన అయితే రెండవది బయటనుండి వచ్చే ప్రతిస్పందన. స్వస్తి ప్రజాభ్య: అనేది ఆ రెంటితో కలిపి చేస్తే దైవీ సంకల్పము అవుతుంది.

కోరికలతో మానసికంగా వ్యభిచరించే ప్రమాదము వున్నది. భగవంతుని శక్తిని మనయొక్క స్వార్థపరమైన కోరికలకు వుపయోగించుకోవటమే మానసిక వ్యభిచారము. అందుకే పరాభక్తినిగురించి చెపుతూ అనేకమంది దేవతలని కొలిచేవాడు వ్యభిచారే అంటాడు నారదుడు. నువ్వు గుర్తుంచుకోవల్సిందేంటంటే - ప్రతిస్పందన కోరుకోవాలి అని.

సి.వి.వి. ప్రార్థన యీ ప్రతిస్పందనకు ప్రముఖపాత్ర వహిస్తుంది.

భగవంతుని కోరిక నా ద్వారా బయటకు రావాలని నిరంతరము అడుగుతూనే వుండాలి తప్ప, వుత్తినే గంటలతరబడి ప్రార్థించటమ invocation అవుతుంది.

చాలా పూజలు చేస్తున్నానండీ, చాలా ప్రార్థనలు చేస్తున్నానండీ అనకూడదు. మనము ఆ పనులన్నీ చేయలేకపోయినా, భగవంతుడి దగ్గఱికి వెళ్ళి 'నువ్వు చెప్పినట్లే నేను వుంటా' నని అనకపోతే భగవంతుని గురించి మనకు యేమి అవగాహన వచ్చింది? ఏమీ రాలేదు. మన కోరికే ముఖ్యమంటే మనము రావణాసురుడికంటే యేవిధంగానూ తక్కువ కాదు. కానీ మనము యెందుకు సిగ్గుపడాలంటే రావణాసురుడు కనీసము తన కోరిక తీర్చుకున్నాడు. మన మదీ చేయలేకపోతున్నాము. ప్రార్థనలో లేక ధ్యానములో మనము వూరికే కూర్చున్నాము. అలా కూర్చుంటే యేమీ వుపయోగము లేదు. మఱి యేమీ చేయకుండా అన్నీ మన దగ్గఱికి వచ్చేయాలంటే యెలా?

**పూర్ణిమకు ఒకరోజు ముందు, పూర్ణిమ రోజు, పూర్ణిమకు ఒకరోజు తరువాత రోజు కచ్చితంగా సూర్యోదయ, సూర్యాస్తమయ కాలాలలో, మధ్యాహ్నము 12 గంటలకి, రాత్రి పూర్ణిమ ఘడియలలో ధ్యానము చేసుకోవటము, మంత్ర జపాలు చెయ్యటము, స్వస్తి ప్రజాభ్యః చెప్పటము యిలా రకరకాలైన** Great Invocation **ప్రాకృతిక శక్తులను నిద్రలేపే స్తోత్రాలను ఉచ్చస్వరంతో ఒక సమూహంగా కలిసి చెయ్యాలి మనము. సామూహికంగా చేస్తున్నప్పుడు కూడా త్రిభుజాకారముగానో, డైగోనల్‌గానో కూర్చుని చేయాలి.**

ముఖ్యముగ ప్రార్థన మఱియు ప్రతిస్పందనలో మహాకామన చేస్తున్నప్పుడు మనము యెంత తీవ్రతతో, స్పష్టతతో, పెద్దగా కోరిక లేకుండా యీ పనిచేయగలమో అలా చెయ్యాలి. ఆలోచన స్పష్టంగా వుండాలి కానీ కోరిక వుండకూడదు. అప్పుడు ఆధ్యాత్మికశక్తియొక్క సక్రియత దానికితోడు మానవుని యొక్క డిమానిస్ట్రేషన్ అనగా మానవుడు తన జీవితంలో దాన్ని చేసి చూపించుట జరుగుతుంది.

ఈ ప్రక్రియను పూర్ణిమకు ఒక రోజు ముందు, పూర్ణిమరోజు, పూర్ణిమకు ఒకరోజు తరువాత అవసరమనుకుంటే వీటికి మూడు రోజులు ముందు సిద్ధము కావడానికి మనము వుపయోగించుకోవాలి. అనగా మొత్తము ఆఱు రోజులు ఏప్రియల్, మే, జూన్ పూర్ణిమలకి చెయ్యాలి. మిగతా నెలలలో పూర్ణిమ, పూర్ణిమ ముందురోజు, పూర్ణిమ తరువాతరోజు అనగా మూడు రోజుల సాధన చేసుకోవాలి మనము.

# ప్రార్థన - ప్రతిస్పందన విజ్ఞానము

రాబోయే రోజులలో ప్రకృతిలో అంత:స్పందన - ప్రతిస్పందన అనే విజ్ఞానశాస్త్రము వస్తోంది.

అదెలా వుంటుందంటే కళాశాలలో ఒక తరగతి గదిలో ఒక పాఠము చెప్పబడుతోంది. విద్యార్థికి ఆ వుపాధ్యాయుడు చెప్పిన పాఠము నేర్చుకోవాలనే తపనుంటే వుపాధ్యాయుడు చెప్పే పాఠము అనే ప్రతిస్పందన వింటాడు. వాడికి నేర్చుకోవాలనే తపన లేక అంత:స్పందన లేదు, కనుక ప్రతిస్పందన అనగా పాఠము వినడు. విద్య రావటంలో అదే జరుగుతుంది. ఉపాధ్యాయుడు చెప్పినప్పుడు ఒకడికి 90% రావటానికి, యింకోడు దానిలో వుత్తీర్ణుడు కాలేకపోవటానికి కారణము అంత:స్పందన లేకపోవటమే. ప్రతిస్పందన వుంది అంటే బయట ఉపాధ్యాయుడు అదే పాఠము అందఱికి చెపుతున్నాడు. కానీ పాఠము వినని విద్యార్థిలో అంత:స్పందన లేకపోవటంవలన ఫలితాలు రావటము లేదు.

మహాకామననికూడ స్పందన -ప్రతిస్పందన అనే విజ్ఞానమును వుపయోగించుకుని చేస్తే అద్భుత ఫలితములను పొందగలము. ఇప్పుడు మహాకామనను మానవజాతి సవ్యంగా వుపయోగించుకోగలిగితే కచ్చితంగా భూమి స్వర్గంగా మారిపోతుంది. అయితే మహాకామనని అవగాహనతో వుచ్చరించాలి.

యదాయదాహి ధర్మస్య..... ఎప్పుడెప్పుడు అధర్మము పెల్లుబికి పోతుందో అప్పుడప్పుడు దాన్ని సవరించటానికి నాఅంతట నేను అవతరిస్తాను అంటాడు జగద్గురువు. అది ప్రకృతి యొక్క నియమము. ఇక్కడ మహాత్ములు, ఋషులు మొదలగువారు ఆయనను ప్రార్థిస్తే; ప్రతిస్పందనగ ఆయన దిగివస్తాడు. ఒక వుదాహరణ ద్వారా యీ విజ్ఞానమును అర్థము చేసికొందాము.

నాకు దెబ్బ తగిలి నెత్తురు కారుతోంది. ఎక్కువగా కారితే నేను చనిపోతాను కనుక నెత్తురు గడ్డ కట్టాలి. గడ్డకట్టటానికి కావల్సిన ప్రక్రియను నేను మొదలెడుతున్నాను అని నేనేమీ శరీరములో ఒకానొక చోట ఒక మీట నొక్కను. శరీరములో ఆ ప్రక్రియ దానంతట అదే జరుగుతుంది. దాన్ని అంత:స్పందన అంటాము. అదే ప్రక్రియ ఆధ్యాత్మిక జగత్తులో కూడా జరుగుతుంది. దాన్ని నేను వుపయోగించటము నేర్చుకుంటే ఆశ్చర్యకరమైన ఫలితాలను పొందగలను. నాలో అంత:స్పందన సరిగ్గా వస్తే ప్రకృతిలో మార్పులు అనగ ప్రతిస్పందనలు సరిగ్గా వస్తాయి. అది సూత్రము. అందుకని ప్రకృతిని మార్చాలంటే నాలో మార్పు రావాలి. నాకు యెలాంటి ప్రకృతి కావాలి?

***స్వస్తిప్రజాభ్యః పరిపాలయన్తాం*** = పృథ్వి యొక్క పరిపాలన మంచిగా ఉండాలి.

***న్యాయేన మార్గేణ మహీం మహీశా:*** = రాజులు న్యాయబద్ధంగా భూమిని పరిపాలించాలి.

నాలో వున్న మూలాధారచక్రానికి యే నియమాలు వర్తిస్తాయో అదే నియమాలు పృథ్వీగ్రహానికి కూడా వర్తిస్తాయి. ఆ నియమాలు వర్తింపజేయగలిగే వ్యక్తే సరైన రాజు. నావిష్ణు: పృథ్వీపతే- విష్ణు అంశ లేని రాజు పరిపాలకుడు కాలేడు. కనుక - **స్వస్తిప్రజాభ్యః పరిపాలయన్తాం న్యాయేన మార్గేణ మహీం మహీశా:** అనే మొదటి అంత:స్పందన నాకు రావాలి. నాకా కోరిక లేదంటే దానర్థము నాకు సరైన రాజ్యము

అక్కర్లేదు అని. లంచ మిస్తే నా పనులు జరిగే రాజ్యము కావాలి తప్ప న్యాయంగా పాలిస్తే నేను సుఖంగా వుండలేను అని అర్థము.

***గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం*** = గోవులకి, బ్రాహ్మణులకి నిత్యమూ శుభము కలగాలి.

గో అనే అక్షరానికి 164 అర్థము లున్నాయి. గో అనగా ఆవు, ఇంద్రియాలు, సూర్యకిరణాలే కాక యింకా చాలా అర్థా లున్నాయి. గో అనగా యిక్కడ సూర్యకిరణాలని అర్థము. ఆ సూర్యకిరణ విజ్ఞానము తెల్సున్నవాళ్ళు బ్రాహ్మణులు. వాళ్ళున్న రాజ్యలో యే మహిమలైనా జరుగుతాయి. అందుకని అందఱు వాళ్ళని చూసి భయపడేవారు. వాళ్ళు నడుస్తూ వుంటే లేచి నుంచోటము అనేది భయంతో కాదు, వాళ్ళల్లో వున్న శక్తిని చూసి.

ఈ అంత:స్పందన రావాలి. ఈ పృథ్వి న్యాయబద్ధంగా పాలించే రాజుల ద్వారా పోషించబడాలి. ఆ రాజ్యంలో యెవరుండాలి? గోబ్రాహ్మణేభ్యః -అలాంటి సూర్యకిరణ విజ్ఞానము తెలిసిన వాళ్ళు వుండాలి. వాళ్లెలా వుండాలి? శుభమస్తు నిత్యమ్ - శుభంగా వుండాలి.

***అపుత్రాఃపుత్రిణస్సన్తు పుత్రిణః స్సన్తు పౌత్రిణః*** =పిల్లలు లేని వాళ్ళకి పిల్లలు కలుగుగాక! పిల్లలున్నవాళ్ళకి మనుమలు కలుగుగాక!

***నిర్ధనా స్సధనా సన్తుజీవన్తు శరదామ్ శతమ్*** = ధనము లేని వాళ్ళకి ధనము సమకూరాలి. వాళ్ళు, వాళ్ళ సంతతి అందఱు వంద సంవత్సరాలు బ్రతకాలి.

ఒకప్పుడు రత్నగర్భ అయిన భారతదేశంలో అసలెవఱు తలుపులకి తాళాలు వేసేవారు కాదుట. ఎందుకు? అందఱి దగ్గిఱ డబ్బున్నప్పుడు యెవరూ దొంగతనం చేయరుగా! ఈనాడు రత్నగర్భ అయిన మన భారతదేశంలో యీ అంత:స్పందన లేదు. నాకు మాత్రమే డబ్బుండాలి; ఎదుటివాడికి వుండకూడదు అనుకుంటే నీకూ వుండదు.

ఈ మహాప్రార్థనని సామూహికంగా చేసుకోగలిగితే అలాంటి పరిస్థితు లేర్పడతాయి. ఆ విజ్ఞానము తెలియకుండా పూజలు చేసిన, యజ్ఞాలు చేసినా అది ఆధ్యాత్మికత కాదు. ఈనాడు మానవుడు సవ్యంగా ఆలోచించడము నేర్చుకున్నాడు. తన భావాలకి స్పష్టమైన అక్షరరూపము యివ్వగల్గుతున్నాడు. కానీ తాను పొందదలచిన ఫలితాలను భౌతిక జగత్తులోకి దింపుకోలేకపోతున్నాడు.

**1) మన మే మంత్ర ముపయోగిస్తున్నామో దా నర్థము, భావములక్ష్యమును నిరంతరము చేతనత్వంలో వుంచుకోవాలి.**

**2) అదే కాలంలో ఆ శబ్దములు లేక పదములలో దాగివున్న, సామర్థ్యమును బాహ్యజగత్తులోకి పంపించగల్గాలి.**

దీనినే పతంజలిమహర్షి “ తజ్జపః తదర్థ భావనమ్” (ప॥యో॥సూ॥ స॥పా-28శ్లో॥) అని చెప్పారు.

స్వస్తి ప్రజాభ్యః... అనే మంత్రాన్ని లేక Great Invocation ని పైన చెప్పిన విధంగా వుపయోగించుకొనే సాధకుల సమూహము త్వరలో ప్రపంచమంతా యేర్పాటు చేయటానికి ప్రయత్నిస్తాను. దీన్ని వుపయోగించు కోవట మంటే దీనిని పరిపూర్ణంగా నిగ్రహించబడిన మనస్సుతో యిది పృథ్వీతత్త్వ ఆత్మయొక్క సంకల్పాన్ని ఘనీభవింపజేసిన పదములు అనే పరిపూర్ణ నమ్మకము, విశ్వాసము వుండాలి. అగ్ని, వాయువు, జలము, పృథ్వి - ఆ నాలుగు శక్తులయొక్క శక్తిని సమీకరించి దాన్ని అవసరమైన యే దిశకైనా ప్రయోగించగలిగే శక్తి శబ్దానికున్నది. ఎందుకంటే శబ్దము మిగతా నాలుగింటిని తయారుచేస్తుంది.

కాబట్టి 'స్వస్తి ప్రజాభ్యః........'' అనే శబ్దమయ తరంగాలు భావనాపూర్వకంగా చేస్తే అలాంటి పృథ్వని తయారుచేసేస్తుంది. ఆత్మ వలె జీవిస్తూ, పనిచేస్తూ, ఆలోచిస్తూ, అనుభూతి చెందగలిగేవారే మంత్రాలను వుపయోగించుకోగల్గుతారు. అందుకనే గురువుగారు 'సాధన వలన సిద్ధి' అనే పుస్తకంలో 'ఇదంతా చదవటము వృథా. నువ్వు ఆత్మవలె జీవించటము నేర్చుకుంటే చాలు' అంటారు. అలాంటప్పుడు మాత్రమే ఋషిపరంపరను - మానవజాతిని కలిపే మంత్రములు యివ్వటానికి సంభవమౌతుంది. దాన్ని గాయత్రీ మంత్రముద్వార యివ్వటానికి ప్రయత్నము చేస్తున్నారు.

గాయత్రీమంత్రమును భావనతో చెయ్యాలి. జపము చేస్తున్నప్పుడు భావము, లక్ష్యము వుండాలి. గాయత్రీని సద్బుద్ధి కావాలని అడగాలి. అర్థవంతంగా చేస్తే అద్భుత ఫలితాలు వస్తాయి.

స్వస్తి ప్రజాభ్యః లేక Great Invocation యొక్క సవ్యమైన వుపయోగము ద్వారా వచ్చే ఫలాలను శంబళలో వుండే చక్రవర్తి గ్రహాతీతశక్తులలోకూడా వుపయోగించుకోగల్గుతాడు. ఈ శక్తులు రెండు రకాలుగా భూమికి చేరుకుంటాయి.

1) సవితా శక్తిధారలు: Solar forces: గాయత్రీ మంత్రము. ఇవి అంతర్గ్రహీయ శక్తిధారలు.
2) సూక్ష్మ గాయత్రి: Cosmic forces : ఇవి బ్రహ్మాండీయ శక్తిధారలు.

ఈ శక్తి ధారలు భూమికి యెలా వుపయోగపడతాయో తెలిపేదే భండాసుర వధ. లలితా సహస్రనామం యీ బ్రహ్మాండీయ కిరణాలు మన సౌరమండలంలోకి దైవీశక్తులను సంప్రేషణ చేసే గురుగ్రహము, కన్యారాశి మఱియు కుంభరాశి ద్వారా మనకి అందజేస్తుంది.

అందుకని ''స్వస్తి ప్రజాభ్యః.........''ను సరిగ్గా చేసినా, గాయత్రీ చేసినా సూర్యశక్తి కదులుతుంది. అంటే యీ నవగ్రహాలకి మనకి మధ్య యే సంబంధ మున్నదో తెలుస్తుంది. రెండవది విశ్వశక్తి. ఇది గురుగ్రహముద్వారా కన్యారాశి, కుంభరాశి నుండి వస్తాయి. ఈ రెండూకూడా శంబళ నుండి - సనక, సనంద, సనత్కుమార, సనత్సుజాతలు పంపిస్తారు. వాళ్ళు నారదుడికి చెప్పిన భాగవతము చదివినా యీ శక్తిధారలు పట్టుకోగలుగుతారు.

గాయత్రీ మంత్రముతో కూడిన శ్వాస లోపలికి వెళ్ళిన తరువాత లోపలికి వెళ్ళి అంతఃకుంభకము జరిగి, ''తత్సవితుర్వరేణ్యం'' అంటే యీ చేతనత్వము సక్రియంగా, ''వరేణ్యం'' అనగా శ్రేష్ఠమైన స్థాయికి తీసుకురావాలి. అదేంటి? మన శరీరము ఆ స్థితికి యెదగాలనే Conscious Activity -చేతనత్వ ప్రక్రియ.

ఆ సౌరశక్తి యేమి చేయాలి? భర్గోదేవస్య ధీమహి- మన శరీరంలో వున్న కుసంస్కారాలను తీసేసి సవితాశక్తిని ధారణ చేసుకోవాలి. అప్పుడేమి జరగాలి? ధియో యో నః ప్రచోదయాత్ - ఆ శక్తి మనల్ని సన్మార్గము వైపు ప్రేరేపించాలి. గాయత్రీ మంత్రము చేయలేనివాళ్ళు- ''స్వస్తి ప్రజాభ్యః.........'' లోని ప్రతీ శ్లోకాన్నీ కూడా లోపలికి పీల్చుకుంటూ వుండటము, వదలటము.... చేయాలి.

''బాహ్య జగత్తులో అది యెలా పనిచేయాలి?'' అని అనుకుంటున్నారో, అదే భావనతో గాలి పీలుస్తూ, వదులుతూ చేయాలి. అప్పుడు ఆ ప్రాణాయామము మీకు కావల్సిన పరిస్థితులను కల్పిస్తుంది. కనుక దీన్ని సంకల్పంతో కలిపి వదలాలి. ఏ కోరికతో అది చేస్తే ఆ ఫలితాలు వస్తాయి. ఆ కోరిక తీరుతుంది.